# కాంగ్రెస్, బీజేపీలను నమ్మద్దు



48వ డివిజన్‌లో మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

- కేసీఆర్ చేతుల్లోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటది
- దొంగలకు ఓటు వేయొద్దు
- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- నగరంలోని 12, 48, 49, 52వ డివిజన్లలో ప్రచారం

కార్పొరేషన్, నవంబర్ 25: ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి ఓటు వేస్తే తెలంగాణ సర్వనాశనం అవుతుందని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. తెలంగాణ కేసీఆర్ చేతుల్లోనే ఉంటే సుభిక్షంగా ఉంటుందన్నారు. నగరంలోని 48, 49, 52, 12వ డివిజన్లలో శనివారం ఆయన ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, మంచి అభ్యర్థులను కాపాడుకోవాలని, వారినే గెలిపించాలన్నారు. నగరం ఎలా అభివృద్ధి చెందిందో ప్రజలు గమనించాలన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఆంధ్రా తొత్తులని, సమైక్య పాలనలో ఇక్కడి సంపదను దోచుకున్నారని విమర్శించారు. నగరంలో రోజూ మంచినీటి సరఫరా చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి వేల కోట్ల నిధులు తీసుకువచ్చి నగర రూపురేఖలు మార్చామన్నారు. అన్ని డివిజన్లలో రోడ్లను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. బీజేపీకి ఓటు వేస్తే అభివృద్ధి జరుగదన్నారు. పదేళ్లలో తెలంగాణ ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. పచ్చని తెలంగాణను చూస్తే ఆంధ్రోళ్లకు కంటగింపుగా మారిందని విమర్శించారు. ఇప్పుడు ఆంధ్రోళ్లంతా ఏకమై ఈఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడగొట్టేందుకు హైదరాబాద్‌లో అడ్డా వేశారన్నారు. తెలంగాణను కాపాడుకునే బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ యాదగిరి సునీల్‌రావు, కార్పొరేటర్లు అఖిల్ ఫిరోజ్, తోట రాములు, కోఆప్షన్ సభ్యులు పుట్ట నరేందర్, అంజాద్, బీఆర్ఎస్ నాయకులు తాటి ప్రభావతి, గూడూరి మురళీ, కర్రె రాజశేఖర్, మైకెల్ శ్రీనివాస్, పూసాల శ్రీకాంత్, ముద్దసాని క్రాంతి, అంజాద్ అలీ, షౌకత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.



48వ డివిజన్‌లో ప్రచారానికి తరలివచ్చిన ప్రజలు

# గంగుల, వినోద్‌కుమార్‌తోనే కరీంనగర్ అభివృద్ధి



మాట్లాడుతున్న మేయర్ యాదగిరి సునీల్‌రావు


- బండి సంజయ్ అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెడుతున్నడు
- మేయర్ యాదగిరి సునీల్‌రావు

కార్పొరేషన్, నవంబర్ 25: మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ కృషితోనే నగరం అభివృద్ధి చెందిందని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. వీరిద్దరూ లేకపోతే నగరం ఈ స్థాయిలో అభివృద్ధి జరిగేది కాదన్నారు. ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వందల కోట్ల నిధులను తీసుకువచ్చి నగర అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. స్థానిక ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బండి సంజయ్ ఎంపీగా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలంటే ముందుకు రాని దద్దమ్మ అని విమర్శించారు. బీజేపీ అభ్యర్థి బండి సంజయ్ రంగురంగుల బుక్‌లెట్ కరపత్రాన్ని పంచుతున్నారని, దీనిపై పెట్టిన శ్రద్ధ ఎంపీగా నియోజకవర్గ అభివృద్ధిపై పెట్టి ఉంటే ప్రజలకు ఎంతో మేలు జరిగేదన్నారు. ఏ రోజు కూడా నియోజకవర్గాన్ని బండి సంజయ్ పట్టించుకోలేదని విమర్శించారు. ఎంపీ ల్యాడ్స్ నిధుల్లో రూ.90 లక్షలు తప్పా ఇప్పటి వరకు నగరాభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఏమైనా నిధులు తెచ్చి ఉంటే ఆధారాలు చూపించాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ పంచిన కరపత్రంలో 30 ఏళ్లుగా కేంద్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న పథకాల నుంచే నిధులు వచ్చాయన్నారు. కరీంనగర్ నియోజకవర్గానికి ఎంపీగా బండి సంజయ్ ఏం తెచ్చాడో చెప్పాలన్నారు. అబద్ధాలు చెప్పి ప్రజలను మభ్యపెట్టి ఓట్లు దండుకోవాలన్న ప్రయత్నాలు చేస్తున్నాడని విమర్శించారు. సీఎం అస్యూరెన్స్ కింద వందల కోట్ల నిధులు తీసుకువచ్చి నగరాన్ని అభివృద్ధి చేశామన్నారు. కరీంనగర్‌లో ఇంత అభివృద్ధి జరిగిందంటే అది కేసీఆర్ ఇచ్చిన నిధులతోనే సాధ్యమైందన్నారు. స్మార్ట్‌సిటీ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన వాటాగా నిధులు విడుదల చేశాయన్నారు. కేంద్రం నుంచి ప్రత్యేకంగా కరీంనగర్ నియోజకవర్గానికి వచ్చింది గుండు సున్నా అని ఎద్దేవా చేశారు. సీఎం కేసీఆర్, వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్ కృషితోనే స్మార్ట్‌సిటీ వచ్చిందన్నారు. సంజయ్‌కి ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కేబుల్ బ్రిడ్జి, ఐటీ టవర్, మానేరు రివర్ ఫ్రంట్, ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. బండి సంజయ్ ప్రజలను పక్కదారి పట్టించడం, మభ్యపెట్టడం ఇప్పటికైనా మానుకోవాలని హితవు పలికారు. ప్రజలకు నాలుగున్నర ఏళ్లు ఏమి చేయలేకపోయానని బహిరంగ క్షమాపణ చెప్పి ఓట్లు అడగాలన్నారు. ఇప్పటికే అనేకసార్లు నియోజకవర్గ అభివృద్ధికి ఏం తెచ్చావో చెప్పాలని అడిగితే ఇప్పటి వరకు సంజయ్ స్పందించలేదన్నారు. ఎంపీగా నాలుగున్నర ఏళ్లు అవుతున్న ఏ రోజు కూడా నగరంలో ఏం జరుగుతుందన్న విషయం మేయర్‌గా ఉన్న తనను ఏ రోజు అడిగిన దాఖలాలు లేవన్నారు. బండి సంజయ్ చెప్పే మాటలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కంసాల శ్రీనివాస్, గంట కళ్యాణి, బండారి వేణు, చాడగొండ బుచ్చిరెడ్డి, యాదయ్య, నాయకులు కొండపల్లి సతీశ్, కాశెట్టి శ్రీనివాస్, అర్ష మల్లేశం, నరేందర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

కార్పొరేషన్, నవంబర్ 25: పీసీసీ మాజీ అధికార ప్రతినిధి వొంటెల రత్నాకర్, నాయకుడు కొప్పుల అజయ్‌కుమార్ శనివారం మంత్రి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గంగుల గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

రత్నాకర్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి గంగుల కమలాకర్ →



# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్, పక్కన ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

- హుస్నాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి సతీశ్‌కుమార్‌ను గెలిపించండి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- మరో అవకాశం ఇస్తే హుస్నాబాద్‌ను నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతా
- ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

హుస్నాబాద్, నవంబర్ 25: హుస్నాబాద్ పట్టణాన్ని ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, మూడోసారి కూడా ఆయనను గెలిపించాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రజలను కోరారు. శనివారం హుస్నాబాద్ పట్టణంలోని పలు వార్డుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అభ్యర్థి వొడితల సతీశ్‌కుమార్‌తో కలిసి ఇంటింటా ప్రచారం, కార్నర్ మీటింగ్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హుస్నాబాద్ పట్టణానికి రెండుసార్లు జాతీయ స్థాయి అవార్డులు వచ్చాయంటే అది ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కృషియేనని అన్నారు. కోట్లాది రూపాయల నిధులు తెచ్చి పట్టణంలోని ప్రతి గల్లీలో సీసీ రోడ్డు వేయించడం, ఇంటింటికీ భగీరథ నీళ్లు అందించడం, సంక్షేమ పథకాలను అర్హులందరికీ ఇప్పించిన సతీశ్‌కుమార్‌ను పట్టణ ప్రజలు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కరీంనగర్ ప్రజలు తిరస్కరిస్తే హుస్నాబాద్‌కు వచ్చి ఇక్కడి ప్రజలను మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్న అభ్యర్థులను నమ్మద్దని సూచించారు. ఒకసారి నమ్మితే ఐదేండ్ల పాటు బాధ పడాల్సివస్తుందన్నారు. హుస్నాబాద్ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ మాట్లాడుతూ, 2014, 2018 ఎన్నికల్లో పట్టణ ప్రజల మద్దతుతో విజయం సాధించి పట్టణాన్ని అభివృద్ధి చేశానని, మరో అవకాశం ఇస్తే పట్టణాన్ని నంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి చేసి చూపించిన తనను మరోసారి ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనితారెడ్డి, కౌన్సిలర్లు వాల సుప్రజానవీన్, పెరుక భాగ్యరెడ్డి, గూళ్ల రాజు, బొల్లి కల్పనాశ్రీనివాస్, కొంకటి నళినీదేవి, గోవిందు రవి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అన్వర్, నాయకులు చిట్టి గోపాల్‌రెడ్డి, అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, ఇంద్రాల సారయ్య, బొలిశెట్టి సుధాకర్, రవీందర్‌గౌడ్, కన్నోజు రామకృష్ణ, బండి పుష్ప, యాటకార్ల స్వరూప, విజయభాస్కర్, చిరంజీవి, వికాస్‌యాదవ్, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పాడి కౌశిక్ రెడ్డిని ఆదరించండి



వేణుగోపాల్‌రెడ్డికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వినోద్‌కుమార్

హుజూరాబాద్‌టౌన్, నవంబర్ 25: కాంగ్రెస్ పార్టీ మనుషులను పెట్టి తమకు అనుకూలంగా ప్రచారం చేయించుకుంటున్నదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. హుజూరాబాద్ పట్టణంలో తెలంగాణ జన సమితి జిల్లా కో–ఆర్డినేటర్ పత్తి వేణుగోపాల్‌రెడ్డి శనివారం బీఆర్ఎస్ జమ్మికుంట పట్టణాధ్యక్షుడు టంగుటూరి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. కాగా, వినోద్‌కుమార్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పట్టణంలోని 22వ వార్డులో గల కాకతీయకాలనీలో ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో బీఆర్ఎస్ అనేక అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు చేపట్టి దేశంలోనే ముందు వరుసలో నిలుపగా దానిని వక్రీకరిస్తూ ప్రతిపక్షాలు విష ప్రచారం చేస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని, సీఎం కేసీఆర్‌ను, బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీలు ఎన్ని విధాలుగా అధికార పార్టీ బీఆర్ఎస్‌పై బురద జల్లాలని చూసినా ప్రజలు వారి మాటలు నమ్మే స్థితిలో లేరని, వారు మా వెంటే ఉన్నారని, ఓట్ల తర్వాత అందరు గుర్తిస్తారన్నారు. ఈవీఎంలో రెండో నంబర్ అయిన కారు గుర్తును ప్రతి ఒక్కరూ గుర్తుంచుకొని ఓటు వేయాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ పింగిలి రమేశ్, హుజూరాబాద్, జమ్మికుంట పట్టణ శాఖల అధ్యక్షులు కొలిపాక శ్రీనివాస్, టంగుటూరి రాజ్‌కుమార్, రాష్ట్ర నాయకుడు వర్ధినేని రవీందర్‌రావు, బీఆర్ఎస్‌వై నియోజకవర్గ ఇన్‌చార్జి తొగరు శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు వడ్లూరి విజయ్‌కుమార్, పంజాల కుమారస్వామి, చందా గాంధీ, పోరెడ్డి కిషన్‌రెడ్డి, కొలిపాక అజయ్, జేకే కుమార్, చిరంజీవి, సుమన్, మైస అనిల్, రమేశ్‌యాదవ్, అన్నయ్య లింగం తదితరులు పాల్గొన్నారు.